

టీడీపీ మాజీ ఎమ్మెల్యే అక్రమాలపై ఆగ్రహం

టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్.. తమ ఇంటి స్థలాలను ఆక్రమించి, దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని బాధితులు ధర్నాకు దిగారు.

-8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ॥ (సా॥)	సహర్ గురు॥ (ఉ॥)
రాయచోటి	6.29	5.07
రాజంపేట	6.27	5.11
పీలేరు	6.29	5.02
మదనపల్లె	6.31	5.07

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.130
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 71 మెట్రిక్ టన్నులు



పేద విద్యార్థులను విస్మరించిన ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం చేయడం వల్ల వారు చదువులు ఆపాల్సి వస్తోంది. దీని ప్రభావం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై పడుతోంది. పిల్లల ఫీజులకు డబ్బులు లేక తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. గతంలో 2018–19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బకాయి పెట్టిన 1800 కోట్ల రూపాయలను వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది. అదే విధంగా 2023–24లో ఎన్నికల కోడ్ కారణంగా ఏర్పడిన బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత నుంచి ప్రస్తుత కూటమి ప్రభుత్వం పక్కకు తప్పుకోవడం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే. ఆ బకాయిలతో కలిపి, ఇప్పటి వరకు 3900 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. లక్షలాది మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంలో ఇంకా జాప్యం చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– జంగంరెడ్డి కిశోర్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు, అన్నమయ్య జిల్లా

నిరుద్యోగులపై నిర్లక్ష్య వైఖరి



కూటమి సర్కారు ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వకపోగా, సీఎం చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార సమయంలో మొదటి సంతకం పెట్టిన మెగా డీఎస్సీ ఇంత వరకు అతీ గతీ లేదు. ఏవేవో సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. మరోపక్క 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి.. కల్పించని సమయంలో నిరుద్యోగ భృతి ఇస్తామని కబుర్లు చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులు పట్ల నిర్లక్ష్య వైఖరి కనబరుస్తున్నారు. నిరుద్యోగ భృతికి అవసరమైన డబ్బులను బడ్జెట్లో ఒక రూపాయి కూడా కేటాయించలేదు.

– శివప్రసాద్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు

వంచనపై గర్జన

- యువతను నిట్టనిలువునా ముంచిన కూటమి
- నిరుద్యోగులకు భృతి లేదు.. ఉపాధి కానరాదు
- ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించని ప్రభుత్వం
- ఐదు త్రైమాసికాలకు రూ.212 కోట్లకు పైగా బకాయిలు
- మదనపల్లె మెడికల్ కళాశాలకు మంగళం
- నేడు కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్‌సీపీ 'యువత పోరు'



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు నిరుద్యోగులను గాలికి వదిలేసింది. అధికారంలోకి రాకముందు ఒకటేమిటి? అది చేస్తాం, ఇది చేస్తామంటూ బురిడీ కొట్టించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు.. అదీ లేకపోతే నిరుద్యోగ భృతి, చదువుకునే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇలా ఎన్నో చెప్పి చివరకు సూపర్ సిక్స్ లేకపోగా, మిగతావి కూడా అమలు చేయకుండా మాయమాటలతో ముందుకు సాగుతోంది. ఇప్పుడే కాదు.. 2014లో కూడా హామీలిచ్చి అధికారంలోకి రాగానే ఎగనామం పెట్టింది. అయితే 2019 వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకవైపు పరిశ్రమలు, మరోవైపు నిరుద్యోగులకు ఉపాధి, ఇంకోవైపు చదువులకు వైఎస్సార్ విద్యాదీవెన ఎప్పటికప్పుడు త్రైమాసికంలోనే అందిస్తూ అన్ని విధాలా ఆదుకోవడం జరిగింది. అంతేకాకుండా అందరి ఆరోగ్యానికి భరోసా నింపుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడం ఒక ఎత్తయితే, మెడికల్ కళాశాలలు నిర్మించి వైద్య విద్యకు పెద్దపీట వేశారు. అయితే కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ముందడుగు పడని పరిస్థితుల్లో.. వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సంకల్పించింది.

చదువుకేదీ భరోసా

వైఎస్సార్‌సీపీ హయాంలో చదువులకు భరోసా ఉండేది. ఇంజినీరు కావాలన్నా.. డాక్టర్ కోర్సు చేయాలన్నా.. ఇతర పెద్ద చదువులకు చదవాలన్నా ప్రోత్సాహం అందించింది. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ విద్యా దీవెన కింద 1,50,934 మందికి సుమారు రూ.378.75 కోట్లు అందించారు. వైఎస్సార్ వసతి దీవెన కింద రూ. 1,28,290 మందికి రూ.150.33 కోట్ల సొమ్మును అందించారు. పేద విద్యార్థులకు వైఎస్ జగన్ సర్కారు అండగా నిలుస్తూ వచ్చింది.

మదనపల్లె మెడికల్ కళాశాలపై నీలినీడలు



నిలిచిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య విద్యకు ప్రాధాన్యతనిస్తూ.. వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల, అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెకు మెడికల్ కళాశాలలు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టింది. గతేడాది జూన్ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభించాలని, అందుకు తగ్గట్టు భవనాలను కూడా తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కళాశాలకు 150 సీట్లు వస్తాయని అంచనా వేసిన తరుణంలో.. కూటమి అధికారంలోకి రాగానే వైద్య కళాశాలలపై నీలినీడలు కమ్ముకున్నాయి. పులివెందుల, మదనపల్లెలో సిబ్బందిని తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్నా.. కూటమి ప్రభుత్వం కళాశాలలను ప్రైవేటుకు అప్పగించే ఆలోచన నేపథ్యంలో ఉన్న వారందరినీ ఇతర ప్రాంతాలకు పంపించేసింది. ఒకపక్క మెడికల్ కళాశాలకు సంబంధించిన సీట్లను కోల్పోగా.. మరోపక్క మదనపల్లె మెడికల్ కళాశాల నిర్మాణంపై సందేహాలు నెలకొన్నాయి.

నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

అన్నమయ్య జిల్లాలో రోజురోజుకు నిరుద్యోగం పెరిగిపోతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు లేక, ప్రైవేటు కొలువులు దొరకక అవస్థలు తప్పడం లేదు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, బీఈడీ తదితర కోర్సులు చేసిన వారు నిరుద్యోగులుగా మారుతున్నారు. అధికారంలోకి రాకముందు కూటమి నేతలు ప్రతి ఒక్కరికీ ఉద్యోగం లేకపోతే.. నిరుద్యోగ భృతి రూ.3 వేలు అందిస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. తీరా ఇప్పుడు చూస్తే తొమ్మిది నెలలు అవుతున్నా అతీగతీ లేని పరిస్థితి కనిపిస్తోంది. కొత్త పరిశ్రమల జాడ జిల్లాలో లేకపోగా, నిరుద్యోగులకు ఉద్యోగాలకల్పన మాటలకే పరిమితమైనట్లు కనిపిస్తోంది. జిల్లాలో సుమారు 2,45,000కు పైగా యువత, నిరుద్యోగులు ఉన్నారు. ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రభుత్వ పెద్దలు ఇంతకుముందు ప్రకటించినా ఇప్పటికీ ఆ ఊసే ఎత్తలేదు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇదిగో, అదిగో అంటున్నారే తప్ప అడుగులు ముందుకు పడని పరిస్థితిపై నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు రాయచోటిలో యువత పోరు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమయ్యారు. కూటమి సర్కారు పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం, నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోకపోవడం, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించకపోవడం, ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం, మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు రాయచోటిలోని జాతీయ రహదారి నుంచి కలెక్టర్ చాంబర్ వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం వినతిపత్రాన్ని సమర్పించనున్నారు. కార్యక్రమం విజయవంతానికి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో పార్టీ నేతలు పోస్టర్లను ఆవిష్కరించారు. యువత పోరుకు పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యో గులు తరలి రావాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు.

భారీగా తరలిరండి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం యువతను, నిరుద్యోగులను, విద్యార్థులను మోసం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ఆదేశాల మేరకు ఈనెల 12న అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న యువత పోరు కార్యక్రమంలో అందరం పాల్గొని, శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని తెలియజేద్దామని మంగళవారం పత్రికలకు అందజేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరణ అంశాలపై యువత పోరు పేరిట శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 4 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందన్నారు. ఎన్నికల సమయంలో జాబు కావాలంటే బాబు రావాలన్నారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న హామీలు ఏమయ్యాయన్నారు. పరిశ్రమల ద్వారా 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న మాటలు ఎక్కడున్నాయన్నారు. మెగా డీఎస్సీపై సాకులు చూపుతూ కాలయాపన చేయడం, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పది నెలల పాలనలో కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న వాటిని తొలగిస్తున్నారని ధ్వజమెత్తారు. వాలంటీర్లు, చిరుద్యోగుల తొలగింపు దారుణం అన్నారు. ఈనెల 12న బుధవారం ఉదయం 10 గంటలకు యువతపోరు కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసుల నిబంధనల మేరకు శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయం.. లాభదాయకం

రాజంపేట రూరల్: ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని జిల్లా డీఆర్‌సీ ఏడీఏ అశోక్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ సచివాలయంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వర్ణ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా మంగళవారం వీఏఏ, వీహెచ్‌ఏ, వీపీఓలతోపాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జి.రాజకుమారి, వెలుగు ఏపీఎం గంగాధర్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వేల్పుల సిద్దయ్య, డీఆర్‌సీ ఏఓ సుచరిత, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్స్ ఏర్పాటు

రాయచోటి అర్బన్: అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్ ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం అన్నారు. పట్టణంలోని అర్చన కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న పెట్రోల్ లీడర్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ఉదయం పరిశీలించారు. పీఎం శ్రీ పాఠశాలల నుంచి వచ్చిన 250 మంది విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో 5 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ మదనమోహన్‌రెడ్డి, హెచ్‌డబ్ల్యూ బి.నిర్మల, స్కౌట్స్ మాస్టర్ నాగరాజ, గైడ్ కెప్టెన్‌లు సుజాత, గోవిందమ్మ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాలకు అరుదైన గౌరవం



ఎన్‌ఏబీఎల్ పత్రంతో మిట్స్ ప్రొఫెసర్లు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు అరుదైన గౌరవం దక్కింది. సివిల్ విభాగానికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కొలాబరేషన్ ల్యాబొరెటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు నాలుగేళ్ల పాటు లభించింది. ఇందుకు సంబంధించిన పత్రాన్ని ప్రిన్సిపాల్ యువరాజ్‌తోపాటు ప్రొఫెసర్లు మంగళవారం మీడియాకు విడుదల చేశారు. ఉన్నత విద్యా ప్రమాణాలకు ఎన్ఏబీఎల్ మార్గదర్శకమవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. దీని ద్వారా పరిశోధన సామర్థ్యాలు పెంచుకోవడంతోపాటు పరిశ్రమలలో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

అడ్డుకోవాల్సిన వారే.. ఆడించేస్తున్నారు..!

- అంతర్ జిల్లాల పేకాటకు అడ్డాగా రాయచోటి
- జోరుగా జూద స్థావరాలు
- నిర్వాహకులకు కొందరు ఖాకీల సహకారం
- పోలీసుల అదుపులో ప్రధాన గ్యాంబ్లర్
- విచారణలో గుట్టు రట్టు



టాస్క్ ఫోర్స్: అధికారమే అండగా.. శిక్షించాల్సిన రక్షక భటులే అసాంఘిక కార్యకలాపాలకు రక్షణగా ఉండటంతో.. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పేకాట స్థావరాలకు అడ్డాగా మారింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జూదరులకు జిల్లా కేంద్రం, పరిసర ప్రాంతాలు వేదికలయ్యాయి. మొబైల్ పేకాట, స్థానికంగా ఉన్న తోటలు, గుట్టల్లో రోజూ కోట్ల రూపాయలు చేతులు మారే జూదం నడుస్తోంది. కొందరు పోలీసులు, ఉన్నతాధికారులు.. నిర్వాహకులు అందించే మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఒక్కో ఆట నిర్వహణకు ముడుపుల రూపంలో లక్ష రూపాయలు ముడుతున్నట్లు ప్రచారం ఉంది. ఇలా రోజుకు రెండు, మూడు క్యాంపులు నిర్వహించి.. అంతే మొత్తంలో గ్యాంబర్లు అశోక్‌రెడ్డి, నర్సరీ రమణ మరికొందరి నుంచి ఓ కానిస్టేబుల్, హోంగార్డు ద్వారా కొందరు పోలీసు అధికారులకు అందుతున్నట్లు తెలియవచ్చింది.

ఈ పరిస్థితి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నా రాయచోటి కేంద్రంగా అధికంగా కనిపిస్తోంది. దీంతో ఎస్పీ నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

స్పెషల్ పార్టీ పోలీసుల దాడులు

జిల్లా వ్యాప్తంగా ఎస్పీకి అనుబంధ శాఖలు, వేగుల నుంచి అందుతున్న సమాచారం మేరకు నేరుగా స్పెషల్ పార్టీ పోలీసులతో పేకాట స్థావరాలపై దాడులు చేస్తూ తనదైన శైలిలో చర్యలు చేపట్టారు. దాడుల సమయంలో జూదరులు అందిస్తున్న సమాచారం మేరకు.. పోలీస్ శాఖ పరిధిలోని ఇంటి దొంగల పేర్లు బయటకు వస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఒక కానిస్టేబుల్, హోంగార్డు, ఒక డబుల్, త్రిబుల్ స్టార్ల అధికారుల పేర్లు కూడా ఆధారాలతో సహా రాబట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

అదుపులో అంతర్ జిల్లా గ్యాంబ్లర్

అన్నమయ్య జిల్లా కేంద్రంగా పేకాట పక్క జిల్లాలు, ప్రాంతాల నుంచి జూదరులను సేకరించే గ్యాంబ్లర్ అశోక్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రాయచోటి సమీపంలో రెండు రోజుల క్రితం పేకాట స్థావరంపై దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. దాడి చేసిన సమయంలో మరో ఐదుగురు పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నట్లు సమాచారం. వారిలో ప్రధానంగా గ్యాంబర్లు అశోక్ రెడ్డి, నర్సరీ రమణ, కానిస్టేబుల్ కోసం ఎస్పీ పార్టీ వలపన్నగా.. అశోక్‌రెడ్డి చిక్కినట్లు తెలుస్తోంది. అశోక్‌రెడ్డి ద్వారా జూదరులకు సహకరిస్తున్న పోలీసులు, పోలీసు అధికారుల వివరాలను రాబడుతున్నట్లు తెలియవచ్చింది. గ్యాంబర్ల నుంచి డబ్బుల చేరవేతలో మధ్యవర్తిగా ఉన్న హోంగార్డును కూడా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి తొలగించి ఎస్పీ కార్యాలయానికి అటాచ్‌మెంట్ చేసినట్లు వినికిడి.

పర్యాటక ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: జిల్లాలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేట.. ఆపేదెట్టా!

- పేట్రేగుతున్న వేటగాళ్లు
- అడవి జంతువులు, వన్యప్రాణులపై గురి
- నాటుబాంబులు, విద్యుత్ తీగలతో ఉచ్చు
- నలుగురు బలైన వైనం
- పట్టించుకోని అధికారులు





తరిగొండ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న అడవి పందులు(ఫైల్)

గుర్రంకొండ: అడవిలో వేటగాళ్లు యథేచ్ఛగా వేటాడుతున్నారు. అడవి జంతువులతోపాటు వన్యప్రాణులను చంపేస్తున్నారు. నాటుబాంబులు, విద్యుత్ తీగలతో విరుచుకు పడుతున్నారు. వారు పన్నిన ఉచ్చులో పడి కొందరు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆహారంలో నాటుబాంబులు కలిపి..

మండలంలోని తరిగొండ, శెట్టివారిపల్లె, సంగసముద్రం పంచాయతీల పరిధిలో విస్తరించిన అటవీ ప్రాంతంలో అడవి పందులతోపాటు ఇతర వన్యప్రాణులను నాటుబాంబులతో వేటగాళ్లు వేటాడుతున్నారు. అడవుల్లో అడవి జంతువులు సంచరించే ప్రాంతాలను పసిగట్టి అవి తినే ఆహారంలో నాటుబాంబులు కలిపి అక్కడక్కడా వేటగాళ్లు పడేస్తున్నారు. తినే ఆహారం దొరికిందని భావించి అని తిని బాంబుపేలుళ్లకు బలవుతున్నాయి. రక్తమోడుతూ కొంత దూరం పరుగెత్తి ప్రాణాలు వదులుతున్నాయి. మరికొన్ని చోట్ల వేటగాళ్లు కాపు కాచి అడవి పందులు నాటుబాంబులు అమర్చిన ఆహారం తినగానే.. వచ్చే బాంబుపేలుళ్ల శబ్దాలకు పరిగెత్తుకొంటూ వెళ్లి అక్కడికక్కడే జంతువులను వేటాడి చంపేస్తున్నారు. ఇక్కడి పరిసర గ్రామాల వేటగాళ్లు వైఎస్సార్ జిల్లా నుంచి నాటుబాంబులను రహస్యంగా తీసుకొస్తున్నట్లు సమాచారం. సంగసముద్రం పంచాయతీలోని వారు స్వయంగా నాటు బాంబులు తయారు చేసుకొని వేటాడుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని నెలలుగా ఈ వేట యథేచ్ఛగా కొనసాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కరెంటు తీగెలు ఏర్పాటు చేసి..

పొలాలు, కొండలు, గుట్టల కింది భాగంలో ఉన్న పరిసర పొలాల్లో కరెంటు తీగెలను ఏర్పాటు చేసి వేటగాళ్లు యథేచ్ఛగా అడవి జంతువులు, వన్యప్రాణులను వేటాడుతున్నారు. వన్యప్రాణుల వేట సిరులు కురిపిస్తుండటంతో.. పలువురు ఇదే మార్గంలో పయనిస్తున్నారు. జిల్లా సరిహద్దులోని కలికొండలు, యల్లంపల్లె, మామిళ్లవారిపల్లె, మర్రిపాడు, శెట్టివారిపల్లె, తరిగొండ అటవీ ప్రాంతానికి సమీప పొలాల్లో కరెంటు తీగెలు ఏర్పాటు చేస్తున్నారు. అడవి జంతువులు, వన్యప్రాణులు రాత్రిళ్లు దాహార్తి తీర్చుకోవడానికి అడవి నుంచి సమీప పొలాలకు వస్తున్నాయి. అక్కడ వేటగాళ్లు పన్నిన విద్యుత్ తీగెల ఉచ్చుల్లో చిక్కుకొని విద్యుత్ ఘాతానికి బలైపోతున్నాయి. ఏడాది క్రితం ఓ జింక ఇక్కడ విద్యుత్ తీగెల్లో చిక్కుకొని మృతి చెందింది. గుర్రంకొండకు సమీపంలోని పొలాల్లో వేటగాళ్లు తరమడంతో నెమళ్ల గుంపు పారిపోతూ పొరబాటున ఎగిరి విద్యుత్ తీగెల్లో చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందింది. సరిమడుగు పంచాయతీ క్రిష్టాపురం, సుబ్బిరెడ్డిగారిపల్లెలో కరెంటు ద్వారా వేటాడుతున్నారు. వేటగాళ్ల ఉచ్చులో పడి అడవి పందులు, కుందేళ్లు, నెమళ్లు, జింకలు మృతి చెందుతున్నాయి.



వేటగాళ్లు వెంబడించి తరమడంతో విద్యుత్ తీగెలపై పడి మృతి చెందిన నెమలి (ఫైల్)

అడవి జంతువుల మాంసానికి డిమాండ్

గుర్రంకొండతోపాటు పరిసర పట్టణాలైన మదనపల్లె, పుంగనూరులో అడవి జంతువుల మాంసానికి భలే డిమాండ్ ఉంది. దీంతో కొంతమంది వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని విక్రయించడమే జీవనాధారంగా చేసుకొన్నారు. అడవి పందుల మాంసాన్ని ఇక్కడి నుంచి మదనపల్లె, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు లాంటి పట్టణాలకు తరలిస్తున్నారు. గతంలో పుంగనూరులో అడవి జంతువుల మాంసం విక్రయాలపై అటవీశాఖ అధికారులు ఆరా తీయగా.. గుర్రంకొండ మండలం నుంచి తీసుకొచ్చినట్లుగా తేలింది. వీరికి పరోక్షంగా ట్రాన్స్‌కో సిబ్బంది, సంబంధిత అధికారులు సహకరిస్తుండటం గమనార్హం. అడవి జంతువులు విద్యుత్ తీగెలకు చిక్కుకొన్నప్పుడు సబ్‌స్టేషన్‌లలో ఫీజులు ఎగిరిపోతుంటాయి. ఎక్కడ వేట జరిగిందనే విషయం ట్రాన్స్‌కో సిబ్బందికి తెలిసే అవకాశం ఉంది. అయినా ఎవరిపైనా చర్యలు తీసుకొన్న దాఖలాలు లేవు. జంతువుల మాంసాన్ని విక్రయిస్తున్నా ఇటు పోలీసులు గానీ అటు అటవీ శాఖ అధికారులు గానీ పట్టించుకొని చర్యలు తీసుకొన్న సందర్భాలు లేవు.

వేటగాళ్లపై నిఘా పెడతాం

మండలంలో జరుగుతున్న వరుస సంఘటనలపై విచారణ జరిపిస్తాం. వేటగాళ్ల కదిలికలపై గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేశాం. అడవి జంతువులను వేటాడినట్లు తెలిస్తే పోలీసుల సాయంతో కేసులు నమోదు చేస్తాం. అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో అడవి జంతవుల వేట వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– రామ్మోహన్, బీట్ అధికారి, అటవీ శాఖ, గుర్రంకొండ

చర్యలు తీసుకుంటాం

వన్యప్రాణులు, అడవి జంతువులను వేటాడటం కోసం అక్రమంగా విద్యుత్‌ను వినియోగించుకొన్న సంఘటనపై విచారణ జరిపిస్తాం. కరెంటును ఏ సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగించారో తెలిసిపోతుంది. సదరు ప్రదేశాన్ని గుర్తించి వేటగాళ్లు, వారికి సహకరించే ట్రాన్స్‌కో సిబ్బందిపై తప్పకుండా చర్యలు తీసుకొంటాం.

– మోసేస్, ఇన్‌చార్జి ఏఈ, ట్రాన్స్‌కో, గుర్రంకొండ

మనుషులు, పాడి ఆవులు మృత్యువాత



సిద్దులు నాయక్ దంపతులు (ఫైల్)



మామిళ్లవారిపల్లె వద్ద నాటు బాంబుకు బలైన పాడిఆవు

వేటగాళ్లు వినియోగించే నాటు బాంబులు, విద్యుత్ తీగెల వల్ల మనుషుల తోపాటు పాడిఆవులు బలి అవుతున్న సంఘటనలు ఉన్నాయి. మండలంలోని మర్రిపాడు గ్రామ కస్పాకు చెందిన నందమహారెడ్డి గ్రామానికి సమీపంలోని తన పొలంలో వేరుశనగ పంట సాగు చేశాడు. ఆయన రెండేళ్ల క్రితం రాత్రి వేళ పొలానికి కాపలాగా వెళ్తుండగా.. పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగెల్లో చిక్కుకొని మృతి చెందాడు. కలకడ మండలం ఎనుగొండ పాళెం తండాకు చెందిన సిద్దులు నాయక్, లీలాభాయ్‌లు గుర్రంకొండకు పక్కనున్న సుంకర వాండ్లపల్లెకు నడకదారిన వెళుతూ.. విద్యుత్ తీగెల మధ్యలో చిక్కుకొని మృతి చెందారు. వారం రోజుల క్రితం చెర్లోపల్లె పంచాయతీ కిలారివాండ్లపల్లె సమీప పొలాల్లో విద్యుత్ తీగెల వల్ల రమేష్‌నాయుడు అనే వ్యవసాయ కూలీ మృత్యువాత పడ్డాడు. యల్లంపల్లెలో ఇరువురు వ్యక్తులు రక్త గాయాలతో బయట పడి ఆస్పత్రుల పాలయ్యారు. మామిళ్లవారిపల్లె నాగరాజుకు చెందిన పాడిఆవు పొలాల వద్ద ఉన్న నాటుబాంబును నమిలి నోరు మొత్తం పేలిపోయి మృతి చెందింది. యల్లంపల్లె, సరిమడుగు, నడిమిఖండ్రిగ గ్రామాల్లో విద్యుత్ తీగెల్లో చిక్కుకొని నాలుగు పాడిఆవులు మృతి చెందాయి.

క్లుప్తంగా

రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడి మృతి



మదనపల్లె : గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి మృతి చెందిన ఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. ధర్మవరం నుంచి నరసాపురం వెళుతున్న రైలు కిందపడి సీటీఎం వద్ద యువకుడు మృతి చెందడంతో గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వివరాలు తెలియలేదు. కాగా, మృతుడు గళ్లచొక్కా, నీలి రంగు ప్యాంటు ధరించి సుమారు 25 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు కదిరి రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ రహీం తెలిపారు.

దేవతానగర్‌లో చోరీ

మదనపల్లె : పట్టణంలోని దేవతానగర్‌లో చోరీ జరిగింది. మంగళవారం చోరీపై బాధితులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న చిన్నరెడ్డెప్ప దేవతానగర్‌లో భార్య అరుణతో కలిసి నివసిస్తున్నాడు. ఈనెల 9న గుర్రంకొండ మండలం శెట్టివారిపల్లె పంచాయతీ అరిగెలవారిపల్లెకు భార్యతో కలిసి వ్యక్తిగత పనులపై వెళ్లారు. పనులు ముగించుకుని పదోతేదీ ఉదయం ఇంటికి రాగా, ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా తలుపులు తెరచి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకున్నారు. 74 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని తాలూకా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్‌టీమ్ సభ్యులు ఆధారాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

టీడీపీ మండల అధ్యక్షుడి కారు దగ్ధం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

రామసముద్రం : మండల టీడీపీ అధ్యక్షుడు విజయగౌడ్ కారును సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు కాల్చివేశారు. సమాచారం అందుకున్న మదనపల్లె రూరల్ సీఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని ఎస్‌ఐ రవికుమార్‌తో కలిసి పరిశీలించి వివరాలు సేకరించారు. అర్ధరాత్రి కారుకు నిప్పు పెట్టడంతో టైర్లు పగిలిన శబ్దానికి మెలకువ వచ్చి చూడగా కారు కాలుతోందని బాధితుడు తెలిపారు. వెంటనే పుంగనూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో మంటలు అదుపు చేశారు. విషయం తెలుసుకున్న సీఐ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎమ్మెల్యే తనయుడు జునైద్ అహ్మద్, టీడీపీ రాజంపేట అధికార ప్రతినిధి ఆర్.జె. వెంకటేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమానితులపై కేసు నమోదు చేశామని, త్వరలో నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే అక్రమాలపై ఆగ్రహం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా
- అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదని ఆవేదన



తహసీల్దార్ కార్యాలయంలోకి ఎవ్వరూ వెళ్లకుండా ప్రధానద్వారం వద్ద బైఠాయించిన బాధితులు

మదనపల్లె : పాతికేళ్ల క్రితం తాము కష్టార్జితంతో కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ అధికార బలంతో అక్రమంగా పొందిన 1బీ అడంగల్‌ను రద్దుచేసి తమకు న్యాయం చేయాలని చేనేత కార్మికులు వేడుకున్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఇంటిస్థలాలను ఆక్రమించి, దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడంపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు ధర్నాకు దిగారు. కార్యాలయం ఎదుట బైఠాయించి, లోపలకి ఎవ్వరిని వెళ్లనీయకుండా అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీకే.పల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 423/2లో కొండుపల్లె యశోదమ్మ, కొండుపల్లె శ్రీనివాసులు, కె.రెడ్డెప్ప నుంచి 77 మంది చేనేత కార్మికులు ప్లాట్ల రూపంలో వేసిన లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేశామన్నారు. ఇందులో కొందరు ఇళ్లు నిర్మించుకోగా, మరికొందరు పునాదులు వేసుకుని, స్థలాన్ని కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. ఈ స్థలాన్ని ఎలాగైనా కాజేయాలనే దురుద్దేశంతో రికార్డులు తనిఖీ చేసుకోకుండా, తమను సంప్రదించకుండా 2020 సంవత్సరం డిసెంబర్ 1న దేశిరెడ్డి హరినాథరెడ్డి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(జీపీఏ) తీసుకుని, ప్లాట్ల రూపంలో అమ్మిన భూమిని, వ్యవసాయభూమిగా పేర్కొంటూ 2025 జనవరి 29న టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ డాక్యుమెంట్ నెంబర్.962/2025 కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. తర్వాత అక్రమంగా భూమిలోకి ప్రవేశించి, పాతికేళ్లుగా ఉన్న తమను ఖాళీ చేసి వెళ్లాల్సిందిగా బెదిరిస్తూ దౌర్జన్యంతో చుట్టూ కంచె నిర్మించాడన్నారు. ఈ విషయమై తాము ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసీల్దార్‌లను కలిసి తమగోడును వివరించి న్యాయం చేయాల్సిందిగా అభ్యర్థించామన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ రిజిస్ట్రార్ గురుస్వామిని పిలిచి రిజిస్ట్రేషన్ రద్దుచేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని ఆదేశించారన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో 1బీ, అడంగల్ ఆన్‌లైన్‌లో ఉన్నందునే తాను రిజిస్ట్రేషన్ చేశానని సబ్ రిజిస్ట్రార్ చెప్పిన నేపథ్యంలో వాటిని రద్దుచేయాల్సిందిగా అధికారులకు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అయితే మూడు వారాలు అవుతున్నా ఇప్పటివరకు అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తమకు న్యాయం జరగని పక్షంలో తమకు చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యాలయ తలుపులు మూయడంపై వివాదం..

న్యాయం చేయాలని బాధితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కూర్చుని నిరసన తెలుపుతుంటే, అధికారులు పట్టించుకోకపోగా.. లోపలకు ఎవ్వరినీ అనుమతించకుండా .కార్యాలయం తలుపులు వేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆడవాళ్లు, చేనేతకార్మికులు నిరసన తెలుపుతున్నా, పట్టించుకోకపోవడంపై నిలదీశారు. దీంతో తహసీల్దార్, కార్యాలయం ఎదుట న్యూసెన్స్ చేస్తున్నారని, పోలీసులను పిలిపించారు. నిరసన తెలిపిన వారిని అదుపులోకి తీసుకోవాల్సిందిగా కోరారు. దీనిపై బాధితులు తాము న్యాయం కోసం మాత్రమే వచ్చామని, తమ భూమిపై అక్రమంగా మంజూరుచేసిన 1బీ అడంగల్‌ను రద్దుచేస్తే చాలని వేడుకున్నారు. తహసీల్దార్ ధనంజయులు మాట్లాడుతూ...పని ఒత్తిడి అధికంగా ఉండటంతో కార్యాలయం తలుపులు వేసుకుని లోపల పనిచేస్తున్నామని, ఆఫీసు వేళల్లో ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్నారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా కలెక్టర్, బాధితులతో మాట్లాడారని, ఆయన ఆదేశాల ప్రకారం నడుచుకోవాల్సిందిగా సూచించారు.

బాధ్యతాయుతంగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలి

– జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రాయచోటి : రోడ్డు భద్రత, వ్యక్తిగత భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రజలకు సూచించారు. మంగళవారం రాయచోటిలో పత్రికలకు అందజేసిన ప్రకటనలో డ్రైవింగ్ లైసెన్సులతో వాహనాలు నడిపి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్పీ కోరారు. చట్టపరమైన అవసరమే కాకుండా రోడ్డు భద్రతకు, వ్యక్తిగత భద్రతకు కూడా చాలా ముఖ్యమన్నారు. దేశంలో మోటారు వాహనాలను నడిపేందుకు డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి అన్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఒక ముఖ్యమైన గుర్తింపు పత్రమన్నారు. చట్టప్రకారం 18 సంవత్సరాలు నిండని వారు వాహనం నడపరాదన్నారు. మైనర్లు వాహనం నడపటం వల్ల వారికి, ఇతరులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనం ఇచ్చిన వారి మీద చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

సచివాలయ దారికి అడ్డంగా కంచె

- గ్రామకంఠం కబ్జా చేసేందుకు కూటమి నాయకుల యత్నం
- పట్టించుకోని అధికారులు



మార్గోపల్లి సచివాలయ కార్యాలయానికి వెళ్లే దారిలో కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక కూటమి నాయకులు రెచ్చిపోతున్నారు. తెలుగుదేశం పార్టీ రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి అనుచరులు చిట్వేలి మండలం, మార్గోపల్లి సచివాలయానికి వెళ్లే దారికి అడ్డంగా సిమెంటు దిమ్మెలను నాటి ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై తహసీల్దార్, ఎంపీడీఓలను వివరణ కోరగా గుడి కోసం కంచె వేశారని చెబుతున్నారు. కాగా గుడి పేరుతో గ్రామకంఠం కబ్జాలకు పాల్పడుతున్నారని సచివాలయానికి వెళ్లేదారిలో కంచె ఏర్పాటు చేస్తుంటే అధికార పార్టీ నాయకులకు అధికారులు అండదండగా నిలుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సచివాలయానికి ప్రత్యామ్నాయంగా సిమెంటు రోడ్డు ఉందని, అయితే సంవత్సరాలుగా సచివాలయానికి వెళ్లే రహదారిలో కంచె ఏర్పాటు చేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే జిల్లాకు సంబంధించిన ఉన్నతాధికారులు కలెక్టర్, సబ్ కలెక్టర్ ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకోవాలని, సచివాలయానికి గతంలో ఉన్న దారిని వదిలి గుడి నిర్మించుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగాల పేరుతో దోపిడీ!

- ఒక్కొక్కరి నుంచి రూ.2 నుంచి రూ.4 లక్షల దాకా వసూలు
- మోసపోయిన నిరుద్యోగులు, విద్యావంతులు

పెద్దతిప్పసముద్రం : ఎంతో ఉన్నత స్థాయి ఉద్యోగిలా చూడ చక్కని వస్త్రధారణ, దీనికి తోడు ఉద్యోగం ఇప్పిస్తానని సదరు వ్యక్తి చెప్పే కల్లిబొల్లి మాటలకు ఇటు నిరుద్యోగులు, అటు విద్యావంతులు సైతం మోసపోయారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం పేరిట నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో సొమ్ము తీసుకుని నిలువునా మోసం చేసిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నవాబుకోట పంచాయతీ నాయనోర్‌పల్లికి చెందిన శేషాద్రి నిరుద్యోగి. పల్లెలోనే వ్యవసాయ పనులు చేస్తూ అటు ఇంటి వద్దనే చదువుకుంటూ ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవాడు. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం నవాబుకోట సచివాలయంలో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి భర్త నాయనోర్‌పల్లిలోని శేషాద్రి తల్లి నాగరత్నమ్మతో మాటలు కలిపాడు. తన వాక్‌చాతుర్యాన్ని ప్రదర్శించి మీ అబ్బాయి శేషాద్రి బాగా చదువుకున్నాడు కదా తనకు పై స్థాయిలో రాజకీయ, అధికార పలుకుబడి ఉందని ప్రభుత్వ హైస్కూళ్లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి వారి నుంచి నాలుగైదు విడతల్లో రూ.4 లక్షల దాకా వసూలు చేశాడు. అనంతరం కొన్ని నెలల తరువాత ఇదే మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్‌లో యోగా ట్రైనర్‌గా ఉద్యోగం వచ్చిందని రూ.18 వేల జీతం అని చెబితే సంబరపడిన శేషాద్రి అతడి సూచన మేరకు పీలేరులో శిక్షణ పొందిన అనంతరం కందుకూరు హైస్కూల్లో నాలుగు నెలల పాటు పని చేశాడు. నయా పైసా జీతం కూడా అందకపోవడంతో నిరాశతో ఇంటికి వచ్చేశాడు. అనంతరం తనలాంటి అమాయకులు ఇంకా ఎంత మంది మోసపోయారోనని సమగ్రంగా ఆరా తీసి తాను ఇచ్చిన డబ్బును రాబట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఉద్యోగాల పేరిట అదే వ్యక్తి ఇదే పంచాయతీలోని బెట్టకొండలో ఓ మహిళ వద్ద రూ.3.50 లక్షలు, బూర్లపల్లిలోని మరో యువతి నుంచి రూ.2.50 లక్షల సొమ్ము వసూలు చేసినట్లు సమాచారం. తిరుపతికి చెందిన ఓ మహిళ అడ్మిన్‌గా ఉంటూ యోగా ట్రైనర్స్ పేరిట వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసిందని అందులో 28 మంది సభ్యులుగా కూడా ఉన్నారని శేషాద్రి పేర్కొన్నాడు. అంతేగాక మండల కేంద్రంలోని ఓ శాఖలో పని చేసి ఇటీవల పదవీ విరమణ పొందిన అధికారి కూడా తన కుమార్తె ఉద్యోగం కోసం రూ.3 లక్షలు ధారపోసి చివరకు రూ.లక్ష వరకు తిరిగి రాబట్టుకున్నట్లు తెలుస్తోంది. తమతో పాటు తమ కన్నవాళ్లు పగలనక, రేయనక పొలాల్లో చెమటోడ్చి కాయకష్టం చేస్తూ సంపాదించిన తమ కష్టార్జిత సొమ్మును మాయమాటలతో నిలువునా ముంచేశాడని, డబ్బులు అడిగితే ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నాడని బాధిత కుటుంబ సభ్యులు కంటతడి పెడుతున్నారు.

17న గ్రామ పంచాయతీ కార్మికుల చలో విజయవాడ



చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య

రాయచోటి అర్బన్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకట్రామయ్య తెలిపారు. మంగళవారం రాయచోటి మండలం చెన్నముక్కపల్లె గ్రామం పీటీఎం పల్లెలో జరిగిన జిల్లా స్థాయి పంచాయతీ కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కార్మికులకు 3 నుంచి 9 నెలల వరకు వేతన బకాయిలను చెల్లించాల్సి ఉందన్నారు. కార్మికుల పేరుమీద ఈఎస్‌ఐ, పీఎఫ్‌లకు నిధులు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రామాంజులు, ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలుగా కొన్ని పంచాయతీలు పూర్తిగా చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దేవరాయలు, ఏ.వి.రమణ, అంజి, మురళి, రెడ్డెయ్య, సుభద్ర, లక్ష్మీదేవి, గంగులు, శ్రీరాములుతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

30 లీటర్ల నాటు సారా స్వాధీనం

సంబేపల్లె : 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మండల పరిధిలోని శెట్టిపల్లె పెద్దబిడికి సమీపంలో నాటుసారా బట్టీలపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సిబ్బంది శశిధర్, వేమారెడ్డి, మోహన్‌రెడ్డి, బాలక్రిష్ణ, హుసేన్, జానీప్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మంచి మార్కులు సాధించాలి

వీరబల్లి : హాస్టల్ విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని వెనుకబడిన తరగతుల జిల్లా సమన్వయ అధికారి సురేష్ బాబు తెలిపారు. మంగళవారం వీరబల్లి మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని గృహ వసతి అధికారి వెంకటసుబ్బయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలకు యత్నం

– భూ యజమానిపై టీడీపీ నాయకుల దౌర్జన్యం

లింగాల : తన పొలంలో టీడీపీ నాయకులు అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి చెందిన టి. విజయమోహన్‌రెడ్డి తెలిపారు. ఓబుళరెడ్డి, మనోహర్‌రెడ్డిలు ముగ్గురాయి తవ్వకాలు చేపట్టారని, దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా తనపై దాడి చేసేందుకు యతి్నంచారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు, లింగాల పోలీసులకు, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశానన్నారు. తనకు సంబంధించిన సర్వే నంబర్ 435/1, 435/2, 434 సర్వే నంబరు నందుగల 7ఎకరాల 75సెంట్లు విస్తీర్ణం గల వ్యవసాయ భూమి ఉందన్నారు. ఈ సర్వే నంబర్లకు తనకు మైనింగ్ లీజ్ ఉందన్నారు. తన భూమిపై వీరికి ఎలాంటి హక్కు లేదన్నారు.

అయ్యో.. పాపం!



తల్లి వదిలివెళ్లిన ఆడ శిశువు

ములకలచెరువు : ఒక తల్లి ఆడబిడ్డను ప్రసవించి అదే చోటే శిశువును వదిలి వెళ్లిన సంఘటన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని జూనియర్ కళాశాల సమీపంలో ఎస్. సుమియా అనే మహిళ సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లింది. కళాశాల పరిసర ప్రాంతంలో ఒక చిన్న పాప ఏడుస్తుండగా దగ్గరికి వెళ్లి చూడగా అప్పుడే ప్రసవించి వదిలివెళ్లిన పాప ఉండడంతో హృదయం చలించిపోయి దగ్గరకు చేర్చుకుంది. చుట్టు పక్కల ఎవ్వరూ లేకపోవడంతో ఇంటికి తీసుకెళ్లి స్నానం చేయించి బట్టలు తొడిగింది. అనంతరం పోలీసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు సమాచారం అందించారు. ఇంటి వద్దకు చేరుకున్న అధికారులు ప్రభుత్వ ఆసుపత్రి, అంగన్‌వాడీ సెంటర్లలోని ప్రసవించిన మహిళల జాబితా పరిశీలించారు. ఎలాంటి సమాచారం దొరకకపోవడంతో చిన్నారిని మహిళ వద్దే పెట్టారు. బుధవారం రాయచోటి శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్తామని సూపర్‌వైజర్ తెలిపారు.

మా భూమిని మాకు ఇప్పించండి

సుండుపల్లె : దాయాదుల నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు తమ తాతల కాలం నుంచి అనుభవంలో ఉన్న భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్న వారి నుంచి భూమిని తమకు ఇప్పించండి అంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మద్దెల వీరనాగయ్య దళిత కుటుంబం ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలలోకి వెళితే.. సుండుపల్లె మండలం పొలిమేరపల్లె గ్రామ పంచాయతీ పలువారిపల్లె గ్రామ పొలం సర్వే నంబర్ 707-23లో 1 ఎకరా 10 సెంట్లు ఉన్న వ్యవసాయ భూమిని తాతల కాలం నుంచి తమ తండ్రి మరణానంతరం సాగు చేసుకుంటూ తమ అనుభవంలో ఉంచుకున్నామన్నారు. ఈ భూమిని అక్రమంగా మద్దెల రెడ్డయ్య అనే వ్యక్తి ఆన్‌లైన్ చేయించుకున్నాడని తెలిపారు. వారి నుంచి భూమిని తమకు అప్పగించి, దాయాదుల బారి నుంచి రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు వీరనాగయ్య కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే మడితాడు గ్రామ పంచాయతీ కొండ్రెడ్డిగారిపల్లె దళితవాడ గ్రామస్తులు ప్రధాన రహదారి నుంచి తమ గ్రామానికి వెళ్లే దారిలో సర్వే నెంబర్ 1192-ఏ1లో 1.54 ఎకరాల వంక పొరంబోకు భూమి ఉన్నదని ఇటీవలే కొందరు వ్యక్తులు అందులో కొంచెం వంక పొరంబోకు భూమిని చదును చేశారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ వైభోమ్ నదియాదేవికి ఫిర్యాదు చేసినట్లు దళితవాడ గ్రామస్తులు తెలిపారు. ఆ భూమిని గృహాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు.

ప్రశాంతంగా ఉరుసు నిర్వహించాలి



ఉరుసు ఉత్సవాల నిర్వహణపై గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐ, మండల అధికారులు

రామాపురం : మండల పరిధిలోని నీలకంఠ్రావుపేట పంచాయతీ సమీపంలో సద్గురు సాయి దర్బార్ నగర్‌లో వెలసిన సద్గురు హజరత్ దర్బార్ అలీషా వలీ, రహమతుల్లా అలై బాబా, జలీల్ మస్తాన్ వలీ బాబా ఉరుసు ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని తహసీల్దార్ రామాంజనేయులు, లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డిలు తెలిపారు. ఉత్సవాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 13న గంధం, 14న ఉరుసు ఉత్సవాలు, రాత్రికి బెంగళూరుకు చెందిన అస్మా నిఖిత్ ఖవ్వాలి, అలాగే నాగపూర్‌కు చెందిన సలీం షైదా ఖవ్వాలి నిర్వహించనున్నారు. 15న తీర్థ ప్రసాదాలతో ఉరుసు ముగుస్తుందన్నారు. ఉరుసు ఉత్సవాలను హిందూ ముస్లిం ఐకమత్యంతో జరుపుకోవాలని సూచించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కలసపాడు : కలసపాడు మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న భార్గవి సోమవారం రాత్రి పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. తీవ్రంగా గాయపడిన ఆ బాలికను చికిత్స నిమిత్తం సిబ్బంది పోరుమామిళ్లలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి కడప రిమ్స్‌కు, ఆ తర్వాత వైద్యుల సూచన మేరకు తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపల్ రెడ్డిజ్యోతిని వివరణ కోరగా విద్యార్థిని ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి కింద పడిందని, వెంటనే అక్కడ ఉన్న సిబ్బందికి తెలియజేసి పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు.

దాడి ఘటనలో కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో పులివెందుల రోడ్డు సాక్షి సర్కిల్ సమీపంలో ఈనెల 10వ తేదీన పాతసామాన్ల అంగడిని నిర్వహిస్తున్న విక్రమ్ వద్దకు మాట్లాడేందుకు మల్లికార్జున అనే వ్యక్తి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడున్న కిషోర్, ప్రకాష్, ఇంకా ముగ్గురు మల్లికార్జునను ఎగతాళి చేశారు. దీంతో ఈ విషయాన్ని మల్లికార్జున తన సోదరుడు, సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మద్దిలేటికి తెలియజేశాడు. మద్దిలేటి వారిని అడిగేందుకు సంఘటన స్థలానికి వెళ్లగా వారు మద్దిలేటి, అతని సోదరుడు మల్లికార్జునపై దాడి చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కడప తాలూకా ఎస్‌ఐ తాహీర్‌హుసేన్ కేసు నమోదు చేశారు.

ఇద్దరు సీఐల బదిలీ

- ముగ్గురి నియామకం



రాయచోటి: పోలీస్ శాఖలో సీఐల బదిలీలు, నియామకాలు చేపట్టారు. మంగళవారం రాత్రి కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ అన్నమయ్య జిల్లా పరిధిలో ఇద్దరిని బదిలీ చేస్తూ, ముగ్గురిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటి అర్బన్ సీఐ పి.చంద్రశేఖర్‌ను కర్నూలు వీఆర్‌కు బదిలీ చేశారు. కర్నూలు జిల్లా ఆలూరు సీఐగా పని చేస్తున్న బి.వి.చలపతిని రాయచోటి అర్బన్ సీఐగా నియామకం చేశారు. రాజంపేట మన్నూరు సీఐగా పని చేస్తున్న కె.మహమ్మద్ అలీని అన్నమయ్య సైబర్ సెల్ సీఐగా, కడప వీఆర్‌లో పని చేస్తున్న ఎస్.కులాయప్పను మన్నూరు సీఐగా, కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో పని చేస్తున్న సీఐ జి.శంకరమల్లయ్యను అన్నమయ్య జిల్లా ఉమెన్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తీర్ణత



మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి

సిద్దవటం : బీసీ వసతి గృహంలో ఉండి చదువుకునే విద్యార్థులు క్రమశిక్షణతో, ఇష్టపడి చదివితే అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించగలరని జిల్లా బీసీ సంక్షేమాధికారి భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం పార్వతీపురంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో మంగళవారం రాత్రి 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నైతిక విలువలను పెంచుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీబీవీడి సభా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. మధుసూదన్, తెలుగు పండిట్ పోలిరెడ్డి, ఉపాధ్యాయులు, జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయం సూరింటెండెంట్ ఆంజనేయులు, స్థానిక వసతి గృహం అధికారి రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సస్పెన్షన్

ఒంటిమిట్ట : గతంలో ఒంటిమిట్టలో పనిచేసి ప్రస్తుతం లక్కిరెడ్డిపల్లె ఎంపీడీఓగా పనిచేస్తున్న రెడ్డెయ్యను సస్పెండ్ చేశారు. గత కొన్ని రోజులుగా ఒంటిమిట్ట మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం జరిగిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిటీ కూడా నియమించింది. దీంతో ఈ కమిటీ ఒంటిమిట్ట మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేసినట్లు నిర్ధారించింది. దీనికి కారణమైన ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సోమశేఖర్, సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ అలీ, ఒంటిమిట్ట పంచాయతీ కార్యాలయంలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న జనార్దన్, గతంలో పనిచేసిన ఈఓపీఆర్‌డీ కుమార గంగయ్యలు సస్పెండ్ అయ్యారు. ఇదిలా ఉండగా గతంలో ఇక్కడ పనిచేసి ప్రస్తుతం లక్కిరెడ్డిపల్లి ఎంపీడీఓగా పనిచేస్తున్న రెడ్డయ్యను కూడా 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేసిన విషయంలో సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.